నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రంభీం ఆసిఫాబాద్

5 | గురువారం 15 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




కన్నెపల్లి కొనుగోలు కేంద్రంలోకి చేరిన వరద నీరు

# వర్షార్పణం

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్

## కాంటాకు వచ్చిన వడ్లు తడిసినయ్..



భీమారం, మే 14 : వడ్లు మ్యాచర్ వచ్చి, కాంటా వేసేందుకు సిద్ధమైన వడ్లు తడిసినయ్. సెంటర్‌లో పరదలు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి సెంటర్‌లో పరదలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలే. అప్పులు చేసి ఆరుగాలం పండించిన పంట చేతికి రాకుండా పోతున్నది. తడిసిన వడ్లను చూస్తే దుఃఖం వస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

**- సెగ్యం నాగరాజు, రైతు, భీమారం**

## వడ్లపై కప్పేందుకు పరదలు ఇస్తలేరు..



భీమారం, మే 14 : గతంలో పరదలు సెంటర్ నిర్వాహకులు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఇస్తలేరు. వానలతో మాకు బాధ అయితున్నది. పరదలు లేక వడ్లన్నీ తడిసినయ్. రెండు ఎకరాల పొలం కోసి ఇక్కడికి తెస్తే లాభం లేకుండా అయింది. తెల్లవారు జామున వచ్చి పరదలు కప్పిన. ఇంకా ఐదు ఎకరాల పొలం కొయ్యలేదు. ఈ వానకు మొత్తం నేలవాలింది.

**- కొమ్ము కొమురన్న యాదవ్, రైతు, భీమారం**

## కొట్టుకపోయిన వడ్లకు డబ్బు లు కట్టియ్యాలే..

జైపూర్, మే 14: ఐకేపీ సెంటర్‌కు 15 రోజుల కింద వడ్లు తీసుకువచ్చినా కాంటా వేయలేదు. హమాలీలు లేరని చెప్పిండ్రు. ఆరబోసిన వడ్లు చాలా వరకు వానకు కొట్టుకపోయినయి. టార్పాలిన్‌లు కూడా ఇవ్వలేదు. టైంకి వడ్లు కొంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఇప్పటికే 42 కిలోలకు 39 కిలోల చొప్పున లెక్క కడుతున్నారు. అధికారులు పట్టించుకొని కొట్టుకుపోయిన వడ్లకు డబ్బులు కట్టియ్యాలే.



**- కొంతం చంద్రకళ, రైతు, రామారావుపేట,**

## వడ్లన్నీ తడిసినయ్

మందమర్రిరూరల్, మే 14 : పంట అమ్ముకుని చేతికి డబ్బులు వచ్చే సమయంలో ఈ వాన మమ్మల్ని దెబ్బతీసింది. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే వానకు మొత్తం తడిసినయ్. తడిసిన ధాన్యాన్ని గవర్నమెంట్ వెంటనే కొనాలే. ఆలస్యం చేయకుండా కొంటే కష్టాల నుంచి గట్టెక్కుతాం.

**- జంగపెల్లి లింగయ్య, రైతు, సారంగపల్లి**



మంచిర్యాల, మే 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించే సమయానికి అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోసిన ధాన్యం బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి తడిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు చోట్ల వర్షపు నీరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముంచెత్తింది. పలుచోట్ల కుప్పలుగా పోసిన ధాన్యంతోపాటు తూకం వేసిన ధాన్యం తడిసింది. మంచిర్యాల, నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం తెల్లవారుజామును భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని కొత్తపల్లి, మద్దికల్, ఆరెపల్లి, రెబ్బపల్లి, దాంపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కోటపల్లి మండలంలోని పారుపల్లి సహా చెన్నూర్ రూరల్ మండలంలోని ఆస్నాద్, కిష్టంపేట, కొమ్మెరలో భారీ వర్షానికి రాసులుగా పోసిన ధాన్యం కుప్పల్లోకి నీరు వచ్చి చేరింది. మందమర్రి రూరల్ మండలంలోని సారంగపల్లి, పొన్నారం, వెంకటాపూర్ కొనుగోలు కేంద్రాల్లో స్వల్పంగా ధాన్యం తడిసింది. కన్నెపల్లి మండల కేంద్రంతోపాటు మాడవెల్లి, మెట్‌పల్లి కొనుగోలు కేంద్రాలు వర్షానికి బురదమయంగా మారాయి. దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోనూ మోస్తరు వర్షం కురిసి.. ధాన్యపు రాశులపైకి వర్షపు నీరు చేరింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంతోపాటు మస్కాపూర్, సుర్జాపూఉర్, సత్తన్నపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను భారీ వర్షం ముంచెత్తింది. దీంతో చాలా వరకు ధాన్యం తడిసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురియడంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, తూకం వేసి మిల్లులకు తరలించేందుకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్యల వలయంలో రైతులు ధాన్యం విక్రయించుకోవాల్సిన దైన్యం నెలకొందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఆలస్యం చేయకుండా తడిసిన ధాన్యాన్ని కూడా తూకం వేసి మిల్లులకు తరలించాలని వేడుకుంటున్నారు.



దస్తురాబాద్ : మండల కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

### రైతుల వేదన

ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయి.
20 రోజులైనా కొనడం లేదు. ఫలితంగా ధాన్యం తడుస్తున్నది.
టార్పాలిన్‌లు ఇవ్వడం లేదు.
హమాలీల కొరత తీవ్రంగా ఉంది.
సమయానికి లారీలు లోడ్, అన్‌లోడ్ కావడం లేదు.
తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.



చెన్నూర్ మండలం ఆస్నాద్‌లో తడిసిన ధాన్యం



దండేపల్లిలో ధాన్యం కుప్పలపై నిలిచిన నీటిని తోడేస్తున్న రైతు

# అన్నదాతల కన్నెర

## సన్న వడ్లకు క్వింటాలుకు 16 కిలోలు కటింగ్‌పై ఆగ్రహం

- బోనస్ పేరుతో దోపిడీ చేయడం సరికాదు
- షరతులు లేకుండా ధాన్యాన్ని కొనాలని డిమాండ్
- జాతీయ రహదారిపై ధర్నా
- పోలీసులు, రైతులకు మధ్య తోపులాట

చెన్నూర్ రూరల్, మే 14: ఇప్పటికే అకాల వర్షంతో ఇబ్బంది పడుతుంటే ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేస్తున్నారని, క్వింటాలు సన్న వడ్లకు 16 కిలోలు, దొడ్డు వడ్లకు 6 కిలోల చొప్పున కటింగ్ చేస్తున్నారని మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని కిష్టంపేట రైతులు రోడ్డెక్కారు. జాతీయ రహదారిపై బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తామంటే పండించామని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 20 రోజులైనా కొనడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు క్వింటాలుకు 12 నుంచి 16 కిలోల వరకు కటింగ్ చేస్తామంటున్నారని దీంతో తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలన్నీ కాంగ్రెస్ నాయకులవి కావడంతో ఆడిందే ఆట పాడిందే పాట అవుతున్నదని, అధికారులు కూడా వాళ్లకే అనుకూలంగా ఉంటున్నారని ఆరోపించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు ధాన్యం అంతా తడిసిపోయిందని వాపోయారు. రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. చెన్నూర్ సీఐ దేవేందర్, ఎస్ సుబ్బారావు అక్కడికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరినా వినలేదు. దీంతో రైతులు పోలీసులకు మధ్య జరిగిన తోపులాటలో కౌలురైతు, బీజేపీ నాయకుడు బుర్ర రాజశేఖర్ గౌడ్ చొక్కా చిరిగిపోయింది. సీఐ దేవేందర్ సముదాయించడంతో రైతులు విరమించారు. అనంతరం సీఐ దేవేందర్‌తోపాటు వ్యవసాయ శాఖ ఏడీఏ బానోత్ ప్రసాద్‌ను తీసుకువెళ్లి తడిసిన వడ్లను రైతులు చూపించారు. అదనపు కలెక్టర్‌తో ఏడీఏ ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. కొనుగోళ్లు వెంటనే వేగవంతం చేయాలని, సన్నవడ్లను కూడా కటింగ్ లేకుండా కొనాలని నిర్వాహకులను అదనపు కలెక్టర్ ఆదేశించడంతో రైతులు శాంతించారు.



ధర్నాలో రైతులను లాక్కెళ్తున్న పోలీసులు

### 20 రోజుల నుంచి గోస పడుతున్న

నేను నాకున్న 8 ఎకరాల్లో సన్న ధాన్యాన్ని పండించాను. 20 రోజుల కింద సెంటర్‌కు తీసుకవచ్చిన. సన్నం వడ్లను మిల్లర్లు తీసుకోవడం లేదంటూ సెంటర్ నిర్వాహకుడు తెలిపాడు. ఒకవేళ కొన్నా క్వింటాలుకు 12 నుంచి 16 కిలోలు కోత పెడుతామంటుండ్రు. అది కూడా మ్యాచర్ ఉంటేనే తీసుకుంటామంటుండ్రు. 20 రోజుల నుంచి నా వడ్లకు నేను కావలి ఉంటున్నా. ఇప్పటికే వానతో ఇబ్బంది పడుతుంటే ధాన్యానికి కటింగ్ పేరుతో మరింత ఇబ్బంది పెడితే ఎలా..? ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి.



**- చేతెల్లి సమ్మిరెడ్డి, కిష్టంపేట**

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయినం

సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 ఇస్తామని కాంగ్రెస్ సర్కారు చెబితే పండించిన. నాలుగు ఎకరాల్లో సన్న ధాన్యాన్ని సాగు చేశాను. వారం క్రితం సెంటర్‌కు తీసుకవచ్చిన. మిల్లర్లు సన్న ధాన్యాన్ని తీసుకోవడం లేదంటూ సెంటర్ నిర్వాహకుడు అంటున్నడు. ఒక వేళ గత్యంతరం లేక విక్రయిస్తే క్వింటాలుకు 16 కిలోల వరకు కోత పెడుతున్నారు. బోనస్ డబ్బులు ఆశతో సన్న రకం వడ్ల పంట వేస్తే ఇలా రైతులను మోసం చేయడం తగదు. దొడ్డు రకం వడ్లకు కూడా కటింగ్ చేస్తున్నరు. లారీలు రావడం లేదంటూ ఆలస్యం చేస్తున్నారు.



**-బొమ్మ రాజిరెడ్డి, కిష్టంపేట**

# మా భవనం.. మాకే కావాలే

- తాళాలు పగులగొట్టిన ఎమ్మెల్యే హరీశ్‌బాబుపై చర్యలు తీసుకోవాలి
- మహిళా సంఘాల రాస్తారోకో

కౌటాల, మే 14 : మండలంలోని సూర్య చంద్ర మండల సమాఖ్యకు కేటాయించిన భవనం మాకే కావాలని, ఇందులో గ్రంథాలయం ఏర్పాటు చేయవద్దని, మాకు తెలియకుండా భవనం గేటు తాళాలు పగుల గొట్టిన ఎమ్మెల్యే హరీశ్‌బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల సభ్యులు బుధవారం కౌటలలోని ఐకేపీ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేశారు. మండల కేంద్రంలోని పాత ఐకేపీ కార్యాలయానికి సంబంధించిన భవనంలో ప్రస్తుతం ఏరియా కో ఆర్డినేటర్‌కు సెంటర్‌గా కొనసాగుతున్నది. ఇందులో మండల గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం భవనాన్ని పరిశీలించేందుకు రాగా గేటుకు తాళం ఉన్నది. 2 గంటలకు పైగా మహిళా సంఘాల సభ్యుల వస్తారని వేచి చూసినా రాకపోవడంతో గేటు తాళాన్ని పగులగొట్టించి ఎమ్మెల్యే లోపలికి వెళ్లారు. బుధవారం ఉదయం గ్రంథాలయం ఏర్పాటు పనులు చేస్తున్న విషయం తెలుసుకున్న మహిళా సంఘం సభ్యులు అక్కడికి చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భవనం మహిళా సంఘాలకు కేటాయించినదని, మేము లేనప్పుడు భవనం గేటు తాళాన్ని ఎలా పగులగొడుతారని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే తీరుకు నిరసనగా, ఈ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ప్రధాన రహదారిపై గంట పాటు రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండే విఠల్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడినా వినలేదు. వెంటనే కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేతో ఫోన్‌లో మాట్లాడి సూర్య చంద్ర మండల సమాఖ్య అధ్యక్షురాలు కమలాబాయితో మాట్లాడించారు. ఈ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయబోమని, వేరే చోటికి తరలిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. అనంతరం భవనం ముందున్న అక్రమ టేలాలను తొలగించాలని ఎమ్మెల్సీ దండె విఠల్‌కు వినతి పత్రాన్ని నాయకులు అందజేశారు. మహిళా సంఘాలకు మద్దతుగా జడ్పీ మాజీ చైర్మన్ సిడం గణపతి, నాయకులు నయీం అహ్మద్, గట్టయ్య, పోశం, భాస్కర్, మండల నాయకులు, తదితరులు ఉన్నారు.



కౌటాల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు

# బాధితులకు భరోసా సెంటర్ చేయూత

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు**

ఆసిఫాబాద్ టౌన్ , మే 14 : లైంగిక దాడికి గురైన బాధితులకు అండగా జిల్లాలోని భరోసా సెంటర్ పనిచేస్తున్నదని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ద్వారా వచ్చిన విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ నుంచి బుధవారం 8 మంది బాధిత మహిళలకు రూ.5 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లైంగిక దాడికి గురైన మహిళలు, బాలికలకు అండగా నిత్యం జిల్లా భరోసా సెంటర్ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా పోలీస్ సేవలు, కౌన్సెలింగ్, వైద్య, న్యాయ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటే సెల్ నంబర్ 8712670561 లేదా డయల్ 100 ద్వారా భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. ఎవరైనా మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఆర్. ప్రభాకర రావు, భరోసా సెంటర్ ఇన్‌చార్జి మహిళా ఎస్ఐ తిరుమల, లీగల్ సపోర్ట్ పర్సన్ శైలజా, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.